www.samasamajam.in

# సమ సమాజం

ప్రశ్నించే అక్షరం... ప్రజలకోసం... తెలుగు దిన పత్రిక

తెలంగాణ | బుధ వారం, 26 అక్టోబర్ 2022 | ఎడిటర్ : గోసుకొండ వృద్విరాజు | సంపుటి - 07, సంచిక-174 | పేజీలు - 4 వెల రూ. 5/-

Published From Hyderabad Circulated by Hyderabad, Rangareddy, Nalgonda, Karimnagar, Warangal, Mahaboobnagar, Kammam, Medak

# మునుగోడులో జోరుగా నేతల ప్రచారం

బిజెపి గెలిస్తే సంక్షేమ పథకాలపై వేటు ● మునుగోడు ప్రచారంలో మంత్రి హెచ్చరిక

బహుజనులంతా ఓటేయాలన్న ప్రవీణ్ కుమార్ ● గడపగడప ప్రచారంలో పాల్వాయి స్రవంతి










**యాదాద్రి భువనగిరి,అక్టోబర్ 25 (సమ సమాజం):** మునుగోడు ఉపఎన్నిక సమయం దగ్గర పడుతున్న కొద్దీ ప్రధాన పార్టీల అభ్యర్థులు ప్రచారంలో స్పీడ్ పెంచారు. ఆయా పార్టీల కీలక నేతలు మునుగోడు నియోజకవర్గంలో మకాంవేసి గెలుపే లక్ష్యంగా పావులు కదుపుతున్నారు. ఇంటింటికి తిరుగుతూ ఓటర్లను అభ్యర్థిస్తున్నారు. మునుగోడు ప్రచారంలో మంత్రి జగదీశ్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. రాజగోపాల్ గెలిస్తే టీఆర్ఎస్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ఆగిపోతాయని అన్నారు. మునుగోడు టీఆర్ఎస్ అభ్యర్థి కూసుకుంట్లకు మద్దతుగా మల్కాపూర్ లో ప్రచారం నిర్వహించిన జగదీశ్ రెడ్డి.. రైతు బీమా కావాలంటే కేసీఆర్?కు ఓటేయాలని అన్నారు. ఓటు వేసేటప్పుడు ప్రజలు ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని, ఎవరికి ఓటేస్తే మంచి జరుగుతుందో తేల్చుకోవాలని సూచించారు. సీఎం కేసీఆర్ రాష్ట్రంలో 24 గంటల 3లో

## రిషి సునాక్‌కు అభినందనలు తెలిపిన ప్రధాని

కలసి పనిచేద్దామని మోడీ పిలుపు

ప్రముఖులకు దీపావళి శుభాకాంక్షలు తెలిపిన ప్రధాని





**న్యూఢిల్లీ, అక్టోబర్ 25 (సమ సమాజం):** రిషి సునాక్ బ్రిటన్ ప్రధాని కావడం పట్ల భారతీయులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రెండు వందల సంవత్సరాలకు పైగా భారత్ ను పాలించిన బ్రిటన్ కు ఓ భారతీయుడు ప్రధాని కావడం భారతీయులందరికీ గర్వకారణం. ఈ నేపథ్యంలోనే బ్రిటన్ పీఎంగా ఎన్నికైన రిషి సునాక్ కు ప్రముఖులు అభినందనలు చెబుతున్నారు. బ్రిటన్ ప్రధానిగా ఎన్నికైన భారత సంతతికి చెందిన రిషి సునాక్ కు భారత ప్రధాని నరేంద్ర మోడీ ట్విట్టర్ ద్వారా 3లో

## వెంకట్‌రెడ్డిని కాంగ్రెస్ పక్కన పెట్టాలి

స్రవంతిని గెలిపించి ఆ రెండు పార్టీలకు బుద్ది చెప్పాలి

ములుగు ఎమ్మెల్యే సీతక్క సంలన వ్యాఖ్యలు



**నల్లగొండ,అక్టోబర్ 25 (సమ సమాజం):** భువనగిరి ఎంపీ, కాంగ్రెస్ పార్టీ స్టార్ క్యాంపెయినర్‌పై ములుగు కాంగ్రెస్ ఎమ్మెల్యే సీతక్క సంచలన వ్యాఖ్యలు చేశారు. మునుగోడు ఉప ఎన్నికలో తమ్ముడి తరఫున ప్రచారం చేస్తున్న వెంకట్ రెడ్డిపై ఆమె నిప్పులు చెరిగారు. వెంకట్ రెడ్డి ఓ దుర్మార్గుడు అని, అలాంటి వ్యక్తిని కాంగ్రెస్ పక్కన పెట్టాల్సిందేనని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీలో ఉంటూ 3లో

## మునుగోడులో వంద చెక్ పోస్టుల ఏర్పాటు

విస్తృతంగా తనిఖీలు చేపట్టిన పోలీసులు

**నల్గొండ,అక్టోబర్ 25 (సమ సమాజం):** మునుగోడు ఉప ఎన్నిక నేపథ్యంలో కేంద్ర బలగాలు, స్థానిక పోలీసులు విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. నియోజకవర్గంలోకి డబ్బు, మద్యం డంప్ కాకుండా వంద చెక్ పోస్టులు ఏర్పాటు చేశారు. మునుగోడు ఉప ఎన్నిక పోలింగ్ సమీపిస్తుండడంతో మూడంచెల భద్రత ఏర్పాటు చేశారు. ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. నల్గొండ జిల్లాలో 60, రాచకొండ పరిధిలో 40 చెక్ పోస్టులు ఏర్పాటు చేశారు. ఒక్కో చెక్ పోస్టు 3లో

## వాట్సాప్‌కు గ్రహణ...వీడింది !

రెండున్నర గంటలపై హైరానా

**న్యూఢిల్లీ,అక్టోబర్ 25 (సమ సమాజం):** భారత్ సహా ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాల్లో వాట్సాప్ సేవలు నిలిచిపోయాయి. సర్వర్ డౌన్ కావడంతో వాట్సప్ సేవలకు అంతరాయం ఏర్పడింది. దీంతో యూజర్లు మెసేజ్ లు చేయలేకపోతున్నారు. మధ్యాహ్నం 12.07 గంటల నుంచి సమస్య తలెత్తినట్లు తెలుస్తోంది. పర్సనల్ మెసేజ్ లకు సింగిల్ టిక్ మాత్రమే వస్తుండగా.. స్టేటస్ లు కూడా అప్ డేట్ కావడం లేదు. దీంతో ఏం 3లో

## పాక్షిక సూర్య గ్రహణం

మూతపడ్డ ప్రధాన ఆలయాలు



**హైదరాబాద్, అక్టోబర్ 25 (సమ సమాజం):** మంగళవారం పాక్షిక సూర్యగ్రహణం కారణంగా ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని ప్రధాన ఆలయాలు మూతపడ్డాయి. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని ఆలయాలను మూసివేసారు.. సూర్యగ్రహణం సాయంత్రం 4:29 గంటలకు ప్రారంభమై సాయంత్రం 5:42 గంటలకు ముగుస్తుంది. అంటే దాదాపు 1:15 నిమిషాల పాటు గ్రహణం భారతదేశంతోపాటు ఇది ఐరోపా, ఆఫ్రికా ఖండంలోని ఈశాన్య భాగం, ఆసియాలోని నైరుతి భాగం, అట్లాంటిక్‌లో కూడా కనిపిస్తుంది. దీంతో తిరుపతి, శ్రీశైలం, పంచారామ క్షేత్రాలతో పాటు అనేక ఆలయాలనుమూసేసారు. ఇక తెలంగాణలోనపి యాదాద్రి ఆలయాన్ని ఉదయం 8:50 నుంచి బుధవారం ఉదయం 8 గంటల వరకు మూసివేసారు. నిత్య, శాశ్వత కల్యాణం, శాశ్వత 3లో

## గౌడ సామాజిక వర్గానికి కెసిఆర్ పెద్దపీట

టిఆర్ఎస్‌తోనే వారికి సామాజిక న్యాయం

మీడియా సమావేశంలో స్వామిగౌడ్



**నల్లగొండ, అక్టోబర్ 25 (సమ సమాజం):** బీజేపీతో గౌడ సామాజిక వర్గానికి, మధ్య తరగతి కుటుంబాలకు న్యాయం జరగదని.. అందుకే టీఆర్ఎస్ లో చేరానని శాసనమండలి మాజీ చైర్మన్ స్వామి గౌడ్ తెలిపారు. 3లో

## నార్సింగ్ సదర్ ఉత్సవాల్లో ఘర్షణ

దున్నల ఊరేగింపులు ఇరు వర్గాల దాడి



**హైదరాబాద్,అక్టోబర్ 25 (సమ సమాజం):** నార్సింగి మున్సిపాలిటీలో జరిగిన సదర్ ఉత్సవాలలో ఘర్షణ చెలరేగింది. మున్సిపల్ వైస్ ఛైర్మన్ వెంకటేష్ యాదవ్, మాజీ సర్పంచ్ భర్త అశోక్ యాదవ్ మధ్య వివాదం చోటుచేసుకుంది. దున్నల ఊరేగింపులో ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకుని లాఠీచార్జ్ చేసి ఇరువర్గాలను చెదరగొట్టారు. అనంతరం అశోక్ యాదవ్ ఇంటిపై వెంకటేష్ యాదవ్ 3లో

## మునుగోడులో అక్రమాలను నిరోధించండి



బుద్ధభవన్‌లో ధర్నాకు దిగిన కోదండరామ్

**హైదరాబాద్, అక్టోబర్ 25 (సమ సమాజం):** మునుగోడు ఉప ఎన్నిక తెలంగాణలో రాజకీయ ప్రకంపనలు సృష్టిస్తోంది. ఈ నేపథ్యంలో తెలంగాణ జన సమితి టీజేఎస్ పార్టీ అధినేత, ప్రొఫెసర్ కోదండరామ్ సంచలన నిర్ణయం తీసుకున్నారు. మునుగోడులో జరుగుతున్న ప్రభుత్వ అక్రమాలు, ఎన్నికల నియమాల ఉల్లంఘనపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ 3లో

## డిఎవి స్కూల్ గుర్తింపు రద్దుతో ఆందోళన

తమ పిల్లల భవిష్యత్ చూడాలంటున్న పేరేంట్స్

నేడు డిఇవోతో భేటీకానున్న తల్లిదండ్రులు

**హైదరాబాద్,అక్టోబర్ 25 (సమ సమాజం):** నగరంలోని బంజారాహిల్స్ డీఏవీ స్కూల్ ఎల్‌కేజీ విద్యార్థినిపై అత్యాచార ఘటన రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై వెంటనే స్పందించిన తెలంగాణ సర్కార్ డీఏవీ స్కూల్ గుర్తింపును రద్దు చేస్తూ నిర్ణయం తీసుకుంది. అయితే స్కూల్ రద్దుతో తమ పిల్లల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతుందని తల్లిదండ్రులు ఆందోళన చెందారు. రద్దు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని ప్రభుత్వాన్ని తల్లిదండ్రులు కోరారు. అయితే డీఏవీ స్కూల్ గుర్తింపు రద్దుపై వెనక్కి తగ్గేది లేదని ప్రభుత్వం స్పష్టం చేస్తోంది. 3లో

## నగరంలో వేర్వేరు చోట్ల రెండు ప్రమాదాలే



బాణాసంచా పేలడంతో అగ్ని ప్రమాదం 3లో

## ఇడి కస్టడీకి ఎంబీఎస్ జ్యుయెలర్స్ ఎండీ సుఖేష్ గుప్తా

2వ తేదీవరకు కస్టడీకి అనుమతించిన కోర్టు



**హైదరాబాద్, అక్టోబర్ 25 (సమ సమాజం):** ఎంబీఎస్ జ్యుయెలర్స్ ఎండీ సుఖేష్ గుప్తాను ఈడీ అధికారులు కస్టడీలోకి 3లో

## సంపాదకీయం

### దీపావళి వేళ భారతీయుల్లో ఆనందోత్సాహాలు

ఈ దీపావళి భారతీయులకు ప్రత్యేకమని చెప్పుకోవాలి. రవి అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్యంగా పేరొందిన బ్రిటన్ ప్రధానిగా భారత సంతతి వ్యక్తి..ఇన్ఫోసిస్ నారాయణమూర్తి అల్లుడు రిషి సునాక్ బాధ్యతలు చేపట్ట డమే. చరిత్రలో ఇలాంటి ఓ అవకాశం వస్తుందని అప్పుడూ అనుకోలేదు. ఈ విపత్క పరిస్థితుల్లో సునాక్ బ్రిటన్‌ను గట్టెక్కించగలిగితే ఆయన పేరు కూడా చరిత్రలో నిలిచిపోతుంది. దీపావళి వేళ సునాక్ ప్రధానిగా ఎన్నిక కాకవడం భారతీయులుగా మనకందరికీ గగర్వకారణం. నిజానికి గత రెండు నెలల క్రితమే సునాక్ ప్రధాని రేసులో ముందున్నా..అనూహ్యంగా లిజ్ దూసుకుని రావడంతో సునాక్ అవకాశాలు చేజారాయి. అయితే లిజ్ తన అసమర్థతో బ్రిన్ ఆర్థిక వ్యవస్థను చక్కదిద్దలేక చేతులెత్తేశారు. దీంతో మరోమారు బ్రిటన్ ఆర్థిక,రాజకీయ సంక్షోభంలో కూరుకు పోయింది. బ్రిటన్ పరిస్థితి వచ్చే ప్రధాని, పోయే ప్రధాని అన్నట్టుంది. కేవలం 44 రోజుల పాటు పని చేసి ప్రధాని లిజ్ ట్రస్ తలవంచుకొని తప్పుకున్నారు. తనకు అప్పజెప్పిన అధికార బాధ్యతలను నిర్వహించడంలో విఫలమయ్యానంటూ రాజీనామా సమర్పించారు. తాను ఏ నేపథ్యంలో ప్రధాని పదవిని చేపట్టానో, తన ముందున్న పరిస్థితులు ఎటువంటివో సవ్యంగా అర్థం చేసుకోలేక తప్పుటడుగులు వేసి దేశ ఆర్థిక వ్యవస్థకు వున్నట్టుండి వణుకు పుట్టించిన ట్రస్ దాని ప్రకంప నాలకు బలైపోయారు. పరిణతిలేని ప్రధాని అనిపించుకొని దిగిపోయారు. ఈ క్రమంల అనివార్యంగా ఇప్పుడు రుషి సునాక్ బ్రిటన్ పదవి అధిష్టింబోతున్నారు. బ్రిటన్ ప్రధానిగా భారత సంతతికి చెందిన రిషి సునాక్ బాధ్యతలు చేపట్ట నుండడం భారతీయులకు ప్రత్యేకించిన దీపావళిగా చెప్పుకోవాలి. 200 ఏళ్లు భారత్‌ను పాలించడం ఓ చరిత్ర అయితే..ఇప్పుడు బ్రిటన్‌ను భారత సంతతి వ్యక్తి ఏలబోతు న్నారంటూ సోషల్ మీడియాలు వార్తుల వెల్లువెత్తుతున్నాయి. అలాగే దాదాపు 200 ఏండ్ల తర్వాత ఆ పదవి చేపట్టనున్న అతి చిన్న వయసు వ్యక్తిగా రిషి రికార్డు సృష్టించబోతున్నారు. 1812లో రాబర్ట్ బ్యాంక్స్ జెంకిన్సన్ 42 ఏండ్ల వయసులో బ్రిటన్ ప్రధాని పగ్గాలు చేపట్టగా.. ఇప్పుడు రిషి సునాక్ ఆ స్థానాన్ని భర్తీ చేయబోతు న్నారు. ప్రధాని పదవి చేపట్టనున్న రిషికి ప్రస్తుతం దేశంలోని ఆర్థిక పరిస్థితులు సవాళ్లు కానున్నాయి. అయితే నారాయణమూర్తి లాంటి దిగ్గజం అల్లుడు కావడంతో పాటు, ఆర్థికరంగంలో స్పష్టమైన అవగాహన ఉన్న వ్యక్తిగా రిషికి ఇదో సవాల్ కాబోదన్నది విశ్వేషకుల అభిప్రాయం. దేశాన్ని నడపడం అంత సులువు కాదన్న విశ్లేషకుల అభిప్రాయాలకు సునాక్ తన పాలనతో జవాబు చెబుతారని బ్రిటిషర్లు కూడా భరోసాతో ఉన్నారు. ప్రపంచంలో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థల్లో ఒకటైన బ్రిటన్ ప్రస్తుతం తీవ్ర ఆర్థిక సంక్షోభంలో కూరుకు పోయింది. దాన్ని గాడిన పెట్టలేక నే అధికారం చేపట్టిన 45 రోజుల్లోనే లిజ్ ట్రస్ రాజీనామా చేయాల్సిన పరిస్థితి తలెత్తింది. పెరుగుతున్న ఇంధన ధరలు ఒకవైపు.. ఆర్థిక వ్యవస్థ పతనం మరోవైపు వెరసి బ్రిటన్‌ను తీవ్ర సంక్షోభంలోకి నెట్టాయి. నిజానికి దీనికి విరుగుడును ముందే రిషి చూపారు. కానీ లిజ్ ప్రధాని కావడంతో అది వెనక్కి పోయింది. మళ్లీ ఇప్పుడు సునాక్ తన ముందున్న వ్యూహాన్ని అమలు చేసయాల్సి ఉంటుంది. ఇప్పటికే పెరుగుతున్న ధరలతో అక్కడి జనం అల్లాడి పోతున్నారు. కరోనా మహమ్మారి సృష్టించిన విలయం అనంతరం బ్రిటన్‌లో ద్రవ్యోల్బణం గత 40ఏండ్ల రికార్డును తిరగరాసింది. ఉక్రెయిన్ యుద్ధం మొదలైన తర్వాత రష్యా నుంచి యూరోప్‌కు సరఫరా అయ్యే క్రూడాయిల్ తగ్గిపోవడంతో దేశంలో ఇంధన ధరలు భారీగా పెరిగాయి. దీని ప్రభావం ఇతర రంగాల మీద కూడా పడింది. ఈ నేపథ్యంలో ద్రవ్యోల్బణం కట్టడి గత ప్రధాని లిజ్‌కు పెను సవాల్‌గా మారింది. నిజానికి బోరిస్ జాన్సన్ ప్రధాని పదవి నుంచి తప్పుకునేందుకు ముంటే బ్రిటన్ ఆర్థిక కష్టాలు తీవ్రమయ్యాయి. ఆయన తర్వాత అధికారంలోకి వచ్చిన లిజ్ ట్రస్ చేపట్టిన పన్ను సంస్కరణలు, వ్యాపారాలపై నియంత్రణ తగ్గించడం తదితర ప్రయోగాలు బెడిసికొట్టాయి. ధనవంతులపై విధించే పన్ను, కార్పొరేట్ ట్యాక్స్ ను 25 నుంచి 19శాతానికి తగ్గిస్తామన్న ఆమె ప్రకటన ప్రజాగ్రహానికి కారణమైంది. పన్ను తగ్గిస్తే ప్రభుత్వ ఆదాయం తగ్గి కొత్త అప్పులు తేవాల్సిన పరిస్థితి తలెత్తుతుంది. ఈ నేపథ్యంలో లిజ్ ట్రస్ తప్పంతా ఆర్థిక మంత్రిపై తోసి పదవి నుంచి తప్పుకున్నా రు. ఈ క్రమంలో ప్రధానిగా బాధ్యతలు నిర్వహించడంద్వారా రిషిసునాక్ తన సత్తా చాటితేనే బ్రిటన్ గండం నుంచి బయటపడగలదు. నిజానికి బ్రిటన్‌లో ఆర్థిక అస్థిరత దేశాన్ని ప్రమాదంలో పడేసింది. ఇన్వెస్టర్లు పెట్టు బడులు ఉపసంహరించుకోవడంతో కరెన్సీ వీలువ భారీగా పతనమైంది. బ్రిటన్ ఆర్థిక పరిస్థితిపై ఇంటర్నేష నల్ మానిటరీ ఫండ్ సైతం హెచ్చరించింది. ప్రస్తుతం దేశంలో కరెంటు బిల్లులు 100శాతం పెరిగాయి. పౌండ్ వాల్యూ 25 శాతం వరకు పతనమైంది. రష్యా నుంచి గ్యాస్ సరఫరా నిలిచిపోగా, శీతాకాలం కావడం తో ఇంధన వినియోగం భారీగా పెరిగింది. దీంతో ధరలు ఒక్కసారిగా పెరిగిపోయాయి. రష్యా నుంచి గ్యాస్, చమురు సరఫరా నిలిచి పోవడంతో విద్యుదుత్పత్తి ఖర్చు పెరిగి కంపెనీలు నష్టాల్లో కూరుకు పోయాయి. దీంతో పేద, ధనిక తేడా లేకుండా ప్రతి ఒక్కరూ విపరీత పరిణామాలను ఎదుర్కొంటున్నారు. దీనిని చెక్ పెట్టేందుకు వీలైనంత తొందరగా రిషి కఠిన చర్యలు తీసుకోవడం ద్వారా బ్రిటన్ ఆర్థిక వ్యవస్థను పట్టాలకు ఎక్కించాల్సి ఉంది. ఇకపోతే బ్రెగ్జిట్ తదనంతర పరిణామాలు కూడా బ్రిటన్‌ను ఆర్థికంగా కుంగదీశాయి. ఈయూలో భాగంగా ఉన్నప్పుడు బ్రిటన్‌కు అప్పట్లో రాయితీలు, ప్రోత్సాహకాలు లభించేవి. బ్రెగ్జిట్ కు ముందు ఐరోపా దేశాల్లోని నిపుణులు యూకే వెళ్లి పనిచేసుకునేవారు. కానీ ఇప్పుడా పరిస్థితి లేకుండా పోయింది. ఐరోపా మార్కెట్లో బిజినెస్ తగ్గిపోతుం దన్న భయంతో చాలా కంపెనీలు బ్రిటన్ నుంచి వెళ్లి పోవడం ద్రవ్యోల్బణానికి దారి తీసింది. ఇదే సమయం లో కరోనా దెబ్బతీయడంతో బ్రిటన్‌లో నిరుద్యోగం పెరిగిపోయింది. ఆర్థిక వృద్ధి ఆగిపోయింది. ఇలాంటి గడ్డు పరిస్థితుల్లో ప్రధాని బాధ్యతలు చేపట్టడం రిషికి సవాలే అని ఆర్థిక విశ్లేషకులు అంటున్నారు. గత ప్రధాని లిజ్ సంపన్నుల మీద పన్నులను తగ్గిస్తూ ఆమె ప్రతిపాదించిన మినీ బడ్జెట్ స్టాక్ మార్కెట్‌ను పతనం చేసింది. ఆర్థిక వ్యవస్థనే అతలాకుతలం చేసింది. 45 బిలియన్ పౌండ్ల మేరకు పన్నులు తగ్గించ బోయారు. అందువల్ల కలిగే ఆదాయ నష్టాన్ని అప్పుల ద్వారా భర్తీ చేస్తానన్నారు. దానితో స్టాక్ మార్కెట్లు తీవ్ర అసంతృప్తిని ప్రకటించాయి. పర్యవసా నంగా పడిపోయిన పౌండ్‌ను కాపాడడానికి బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్ జోక్యం చేసుకోవలసి వచ్చింది. అంతర్జాతీయ ద్రవ్యనిధి ఐఎంఎఫ్ సంస్థ అసంతృప్తిని వ్యక్తం చేసింది. వెంటనే ట్రస్ తన చర్యలను వెనక్కి తీసుకొన్నప్పటికీ ఫలితం లేకపోయింది.

పృధ్విరాజ్ గోసుకొండ
ఎడిటర్

# కార్గిల్‌లో ప్రధాని దీపావళి వేడుకలు

## సైనికులకు స్వీట్లు తినిపించిన మోడీ

**కార్గిల్,అక్టోబర్ 25 (సమ సమాజం):** ప్రధాని మోడీ కార్గిల్‌లో సైనికులతో దీపావళి వేడుకలు చేసుకున్నారు. సైనికులకు స్వయంగా స్వీట్లు తినిపించారు. ప్రతి ఏడాది ప్రధాని మోడీ సైనికులతో దీపావళి వేడుకలు జరుపుకుంటున్న సంగతి తెలిసిందే. గతేడాది జమూకాశ్మీర్‌లోని రాజౌరీ జిల్లా నౌషేరా సెక్టార్‌లో ప్రధాని సైనికులతో కలిసి దీపావళి వేడుకల్లో పాల్గొన్నారు. ఈ ఏడాది కూడా సైనికులతో వేడుకలు జరుపు కునేందుకు కార్గిల్ చేరుకున్నారని ప్రధానమంత్రి కార్యాలయం వెల్లడించింది. ప్రధాని కార్గిల్ చేరుకున్న ఫొటోలను మీడియలో పోస్ట్ చేసింది. దీపావళి పండుగ సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధాని మోడీ ట్విటర్ వేదికగా దేశ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. వెలుగు, ఆనందాలతో నిండే ఈ పవిత్రమైన పర్వదినం జ్ఞానాన్ని పంచుకుంటూ అందరి జీవితాల్లో సంతోషాన్ని తీసుకురావాలని కోరుకుంటున్నానని రాష్ట్రపతి ట్వీట్ చేశారు. అందరికీ దీపావళి శుభాకాంక్షలు. దీపావళి పండుగ మన జీవితాల్లో సంతోషం, శ్రేయస్సు, స్ఫూర్తిని మరింతగా పెంపొందాలని, మీ కుటుంబం, స్నేహితులతో అద్భుతమైన దీపావళిని జరుపుకోవాలని కోరుకుంటున్నట్లు ప్రధాని మోడీ ట్వీట్ చేశారు.



# ప్రిన్స్ ఛార్లెస్‌తో రిషి సునాక్ భేటీ

### తనకు బలముందని వెల్లడి
### ప్రధానిగా నియామించిన రాజు
### దేశాన్నిఆర్థికంగా గట్టెక్కిస్తానని రిషి ప్రకటన



**లండన్,అక్టోబర్ 25 (సమ సమాజం):** భారత సంతతికి చెందిన రిషిసునాక్ (42) బ్రిటన్ ప్రధాని బాధ్యతలు చేపట్టారు. ఆయనను ప్రధానిగా బ్రిటన్ రాజు చార్లెస్ -3 నియమించినట్లు ప్యాలెస్ ప్రకటించింది. ఈ మేరకు సునాక్ ఛార్లెస్‌ను కలిసారు. కన్జర్వేటివ్ పార్టీకి చెందిన బోరిస్ జాన్సన్ ప్రధాని రేసు నుండి వైదొలగడం, పెన్నీ మోర్డాంట్‌కు తగినంత మద్దతు లభించకపోవడంతో రిషికి మార్గం సుగమమైంది. ప్రధానిగా తనకు మద్దతు ఉందని ప్రభుత్వ ఏర్పాటుకు అనుమతివ్వాలని చార్లెస్ -3 ని రిషి కోరినట్లు సమాచారం.లండన్ బకింగ్‌హామ్ ప్యాలెస్‌లో కింగ్ ఛార్లెస్-3ని కలిశారు. లిజ్ ట్రస్ ప్రధాని బాధ్యతల నుంచి తప్పుకోవడం, రిషి సునాక్‌ను ప్రధాని బాధ్యతలు స్వీకరించడం అంతా నిమిషాల్లో జరిగిపోయాయి. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఆర్థిక సంక్షోభం నుండి బయటపడేందుకు తన వంతు కృషి చేస్తానని, బ్రిటన్ ప్రజలు తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని అన్నారు. ఆర్థిక సంక్షోభం నుండి బయటపడేందుకు కొన్ని కఠిన నిర్ణయాలు తప్పవని, అద్భుతాలు సాధించగలమని అన్నారు. అంతకుముందు చార్లెస్ -3 కి లిజ్ ట్రస్ తన రాజీనామాను సమర్పించారు. 200 ఏళ్లలో బ్రిటన్ అత్యున్నత పదవిని చేపట్టిన పిన్న వయస్కుడిగా రిషి సునాక్ రికార్డు సృష్టించాడు . మాజీ ప్రధాని లిజ్‌ట్రస్ రాజీనామా చేయడంతో ఈ ఏడాదిలోనే రిషిసునాక్ బ్రిటన్ మూడవ ప్రధానిగా బాధ్యతలు చేపట్టారు. బుధవారం పార్లమెంటులో మొదటి సెషన్‌ను ఎదుర్కోనున్నారు. బ్రిటన్ ప్రధానిగా రిషి సునాక్ తొలి ప్రసంగం చేశారు. రానున్న రోజుల్లో కఠిన నిర్ణయాలకు బ్రిటన్ ప్రజలు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. అప్పుల సమస్య పరిష్కారాన్ని రానున్న తరాలకు వదిలేయబోనన్నారు. లిజ్ ట్రస్ ద్వారా జరిగిన తప్పిదాలను సరిచేయడానికే తాను ప్రధాని అయినట్లు రిషి సునాక్ చెప్పారు. అంతకు ముందు బ్రిటన్ ప్రధానిగా లిజ్ ట్రస్ చివరి ప్రసంగం చేశారు. బ్రిటన్ కష్టకాలంలో ఉందని అయితే అతి త్వరలోనే మళ్లీ కోలుకుంటుందనే విశ్వాసం వ్యక్తం చేశారు. తనకు బ్రిటన్ పౌరులపై నమ్మకముందని చెప్పారు. బ్రిటన్ ప్రధానిగా కొత్తగా ఎన్నికైన రిషి సునాక్‌కు ఆమె ఆల్ ది బెస్ట్ చెప్పారు. బ్రిటన్ రాణికి జాతి అంతిమ వీడ్కోలు పలికిన సమయంలో తాను బ్రిటన్ ప్రధానిగా ఉండటం తనకు గౌరవనీయమని విషయమని లిజ్ ట్రస్ చెప్పుకున్నారు. పుతిన్‌పై ఉక్రెయిన్ ధైర్యంగా పోరాడుతోందని, అందరూ ఉక్రెయిన్‌కు మద్దతునీయాలని సూచించారు. అంతేకాదు బ్రెగ్జిట్ వల్ల సొంతంగా ప్రయోగాలు చేసి ప్రయోజనాలు పొందాలని ఆమె సలహాఇచ్చారు. ప్రధానిగా చివరి ప్రసంగం చేశాక లిజ్ ట్రస్ బకింగ్‌హామ్ ప్యాలెస్‌కు వెళ్లారు. బ్రిటన్ ప్రధానిగా బోరిస్ జాన్సన్ తప్పుకున్నాక లిజ్ ట్రస్ అధికార కన్సర్వేటివ్ పార్టీ నుంచి ప్రధానిగా ఎన్నికయ్యారు. కన్సర్వేటివ్ పార్టీ తరపున రిషి సునాక్, లిజ్ ట్రస్ మధ్యే పోటీ జరిగింది. చివరకు లిజ్ ట్రస్ విజేతగా నిలిచారు. కానీ ఆమె తీసుకు వచ్చిన మధ్యంతర బడ్జెట్ బ్రిటీష్ ఆర్థిక వ్యవస్థను మరింత అస్తవ్యస్తం చేసింది. లిజ్ ట్రస్ ఆర్థిక విధానాలతో బ్రిటన్ మరింత కష్టాల్లో చిక్కుకుంది. ఈ తరుణంలో అధికారం చేపట్టిన 45 రోజులకే ఆమె యూ టర్న్ తీసుకున్నారు. ప్రధానిగా తాను తప్పుకుంటున్నట్లు ప్రకటించారు. ఆ తర్వాత కన్సర్వేటివ్ పార్టీ రిషి సునాక్‌ను ప్రధానిగా ఎన్నుకుంది. వెయిటర్ నుంచి ప్రధాని స్థాయికి ఎదిగిన రిషి సునాక్ బ్రిటన్ చరిత్రలోనే ప్రధాని బాధ్యతలు స్వీకరించిన అత్యంత పిన్న వయస్కుడు.

# కనువిందు చేసిన పాక్షిక సూర్యగ్రహణం

## పలుచోట్ల ఆసక్తిగా తిలకించిన జనం






**న్యూఢిల్లీ,అక్టోబర్ 25 (సమ సమాజం):** ప్రపంచ దేశాల్లో మంగళవారం సాయంత్రం పాక్షిక సూర్యగ్రహణం ఏర్పడింది. ఈ సూర్యగ్రహణాన్ని వివిధ దేశాల ప్రజలు వీక్షించారు. మన దేశంలోనూ పలు ప్రాంతాల నుంచి ఈ గ్రహణాన్ని చూశారు. తెలంగాణలో సైతం పలు ఏరియాల్లో పాక్షిక సూర్యగ్రహణం దర్శనమిచ్చింది. ఈ గ్రహణాన్ని అరుదైన ఖగోళ విచిత్రంగా చెప్పుకోవచ్చని శాస్త్రవేత్తలు తెలిపారు. ఎందుకంటే చాలా ఏండ్ల వరకు ఇలాంటి గ్రహణం మళ్లీ కనిపించదని అంటున్నారు. హైదరాబాద్‌లో బిర్లా ప్లానెటోరియం ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. భారత దేశంలో తదుపరి సూర్యగ్రహణం 2027 ఆగస్టు 2న కనిపిస్తుందని ఖగోళ శాస్త్రవేత్తలు వెల్లడించారు. ఈగ్రహణం భారత్‌లోని జైపూర్, నాగ్‌పూర్, ద్వారక, చెన్నై, ముంబై, కోల్‌కతా తదితర నగరాల్లో కనిపించింది. సాయంత్రం సరిగ్గా 4.29 గంటలకు సూర్యగ్రహణం ప్రారంభమైంది. సాయంత్రం 6.26 గంటల వరకు కొనసాగింది. హైదరాబాద్‌లో సాయంత్రం 4.59 గంటలకు పాక్షిక సూర్యగ్రహణం ప్రారంభం కాగా.. ఢిల్లీలో సాయంత్రం 4.29 గంటలకు, కోల్‌కతాలో సాయంత్రం 4.52 గంటలకు, చెన్నైలో సాయంత్రం 5.14 గంటలకు, ముంబైలో 4.49 గంటలకు, ద్వారకలో 4.36 గంటలకు, తిరువనంతపురంలో 5.29 గంటలకు, నాగ్‌పూర్‌లో 4.49 గంటలకు గ్రహణం మొదలైంది. గ్రహణాన్ని నేరుగా కంటితో చూడటం ప్రమాదకరమని నిపుణులు హెచ్చరించడంతో పలువురు ప్రత్యేక పరికరాల సాయంతో వీక్షించారు.


# కాంట్రాక్టుల కోసమే రాజగోపాల్ రాజీనామా

### ఇప్పుడు ఉప ఎన్నికతో లాభం ఏంటి: తలసాని



**హైదరాబాద్,అక్టోబర్ 25 (సమ సమాజం):** ఫ్లోరైడ్ సమస్య పరిష్కరిస్తామని సిఎం కెసిఆర్ గతంలోనే చెప్పారని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. చెప్పినట్లే మిషన్ భగీరథతో ఫ్లోరైడ్ సమస్యను అంతం చేశారని పేర్కొన్నారు. నల్గొండ జిల్లాలో పెండింగ్ పనులు వచ్చే ఏడాదిలో పూర్తవుతాయని మంత్రి వివరించారు. మునుగోడులో విజయం కోసం బిజెపి ఎన్ని కుట్రలైనా చేస్తుంది, ప్రజలు నమ్మొద్దన్నారు. దాడి, గాయాలు అంటూ నాటకాలు ఆడి టిఆర్ఎస్ పై నెపం వేస్తారని మంత్రి సూచించారు. ఎన్నికలకు ఏడాది ముందు రాజీనామాతో ఏం ప్రయోజనం వస్తుందని తలసాని ప్రశ్నించారు. కాంట్రాక్టుల కోసమే రాజగోపాల్ రెడ్డి రాజీనామా చేశారని ఆయన ఆరోపించారు. విపక్షాల డ్రామాలను ప్రజలు నమ్మడం లేదని మంత్రి తలసాని అన్నారు. మునుగోడును కేటీఆర్ దత్తత తీసుకుంటున్నారని మంత్రి తలసాని తెలిపారు. ఫ్లోరైడ్ సమస్య పరిష్కరిస్తామని కేసీఆర్ ఉద్యమ టైమ్‌లోనే చెప్పారని, మిషన్ భగీరథతో జిల్లాలో ఫ్లోరైడ్ సమస్యను అంతం చేశారని మంత్రి గుర్తు చేశారు. జిల్లాలోని పెండింగ్ సమస్యలు వచ్చే ఏడాదిలోగా పూర్తి చేస్తామని మంత్రి తలసాని అన్నారు. గెలుపు కోసం బీజేపీ ఎన్ని కుట్రలైనా చేస్తుందని, ప్రజలు నమ్మొద్దని వెల్లడించారు. ఎన్నికలకు ఏడాది ముందు రాజీనామా చేస్తే.. ఏం ప్రయోజనం? అని తలసాని ప్రశ్నించారు. రాజగోపాల్‌రెడ్డి ఇంతకు ముందు ఎమ్మెల్యేనే మళ్లీ గెలిస్తే మాత్రం ఏమవుతుంది?అని మంత్రి తలసాని అన్నారు. కేవలం కాంట్రాక్టుల కోసమే రాజీనామా చేసి బీజేపీలో చేరారని, బీజేపీ నేతలు దాడి, గాయాలంటూ నాటకాలు మొదలుపెట్టారని తలసాని మండిపడ్డారు. వాళ్లే దాడులు చేయించుకుని ఏడుస్తారని, తాము కాంట్రాక్టల కోసం రాజకీయాలు చేయమని మంత్రి తలసాని స్పష్టం చేశారు. కుట్రలు, కుతంత్రాలు తమకు అవసరం లేదని మంత్రి తలసాని వెల్లడించారు.

# మునుగోడులో గెలిచేది టిఆర్ఎస్ మాత్రమే:చాడ



**హైదరాబాద్,అక్టోబర్25(ఆర్ఎన్ఎ):** మునుగోడు ఉప ఎన్నికలో మూడు ప్రధాన రాజకీయ పార్టీల మధ్య హోరాహోరీ పోరు సాగుతున్నట్లు సర్వేలు చెబుతున్నప్పటికీ టీఆర్ఎస్ గెలుపు ఖాయమని తెలంగాణ సీపీఐ రాష్ట్ర మాజీ కార్యదర్శి చాడ వెంకట్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. గత మూడేళ్లుగా నియోజకవర్గ అభివృద్ధిపై దృష్టి సారించలేదని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ అభ్యర్థి కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ఓటర్లను దుర్వినియోగం చేశారని సీపీఐ నేత మండిపడ్డారు. కోమటిరెడ్డి సోదరులు తమ తోబుట్టువుల సంబంధాన్ని రాజకీయాల్లో ఉపయోగించుకుంటున్నారని మండిపడ్డారు. రాజగోపాల్ రెడ్డి ఎమ్మెల్యే పదవికి, కాంగ్రెస్‌కు రాజీనామా బీజేపీలో చేరిన ముచ్చట తెలిసిందే. మునుగోడులో నవంబరు 3న ఉప ఎన్నికల పోలింగ్ నిర్వహించి, నవంబర్ 6న ఫలితాలను ఎన్నికల సంఘం ప్రకటించనుంది.

# కర్నాటక గీత కార్మిక సమస్యలకు మద్దతు

### మంత్రి కెటిఆర్‌కు కృతజ్ఞతు తెలిపిన ప్రణావానంద



**హైదరాబాద్,అక్టోబర్ 25 (సమ సమాజం):** కర్ణాటక గీత కార్మికుల పక్షాన సానుకూలంగా స్పందించినందుకు రాష్ట్ర మంత్రులు కెటిఆర్, శ్రీనివాస్‌గౌడ్‌కు శ్రీ నారాయణ గురు శక్తిపీఠం పీఠాధిపతులు, ఆర్య, ఈడిగ రాష్ట్రీయ మహామండలి జాతీయ అధ్యక్షుడు డాక్టర్ ప్రాణవానంద స్వామి కృతజ్ఞతలు తెలిపారు. కర్ణాటకలో బిజెపి ప్రభుత్వం కల్లును నిషేధించి గీత కార్మికుల ఉపాధిని, ఆత్మగౌరవాన్ని కించపరిచేలా వృత్తిపై నిషేధం విధించింది. దీనిపై తెలంగాణ రాష్ట్ర ఆబ్కారీ మంత్రి శ్రీనివాస్ గౌడ్, రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి కెటిఆర్ పలు వేదికలపై బిజెపి ప్రభుత్వ తీరును ఎండగట్టారు. గీత కార్మికుల పక్షాన సానుకూలంగా స్పందించినందుకు కర్ణాటక గీత కార్మికుల పక్షాన పోరాటం చేస్తున్న ప్రణవానంద స్వామి మంగళవారం హైదరాబాదులోని కెటిఆర్ క్యాంప్ కార్యాలయంలో మంత్రులను కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. గీత కార్మికుల సంక్షేమం, అభివృద్ధి కోసం తెలంగాణ ప్రభుత్వం ముఖ్యమంత్రి కెసిఆర్ నేతృత్వంలో అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు కర్ణాటక రాష్ట్రంలో అమలు చేయాలని ఆ రాష్ట్ర బిజెపి ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. బిజెపి పాలిత రాష్ట్రాలలో కులవృత్తులను, చేతి వృత్తులను నిర్వీర్యం చేసి వెనుకబడిన వర్గాలకు చెందిన ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని మంత్రులకు ఆయన వివరించారు. కార్యక్రమంలో రాష్ట్ర గౌడ సంఘం అధ్యక్షుడు పల్లె లక్ష్మణ్‌రావుగౌడ్, ప్రధాన కార్యదర్శి ప్రశాంత్‌గౌడ్ అఖిల భారత గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కూరెళ్ళ వేములయ్యగౌడ్, సంఘం రాష్ట్ర నేతలు ధనుంజయగౌడ్, రవి గౌడ్, సుదర్శన్ గౌడ్, సంజయ్ గౌడ్, ప్రతాప్ గౌడ్, బత్తిని లతా గౌడ్, అనిల్ గౌడ్ పాల్గొన్నారు.

# బహుజన స్ఫూర్తి ప్రదాతలపై రెండ్రోజుల సదస్సు

### పోస్టర్‌ను ఆవిష్కరించిన జూలూరి గౌరీశంకర్

**హైదరాబాద్,అక్టోబర్25(ఆర్ఎన్ఎ):** బహుజనులకు అండగా నిలిచి సామాజిక ఉద్యమాలు నిర్మిస్తూ సాహిత్య సాంస్కృతిక చరిత్రలను సృష్టించిన సాహిత్య సాంస్కృతిక సామాజిక యోధుల చరిత్రలను నమోదు చేసుకోవడం శుభ పరిణామం అని తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరి గౌరి శంకర్ చెప్పారు. తెలంగాణ ఆవిర్భావం తర్వాత భావి తరాలకు మన సాహిత్య సాంస్కృతిక చర్యలను అందించే కార్యక్రమం ముమ్మరంగా సాగుతున్నదన్నారు. సిద్ధిపేట జిల్లా గజ్వేల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నవంబర్ 17, 18 తేదీల్లో 'బహుజన స్ఫూర్తి ప్రదాతలు' అనే అంశంపై జరుగనున్న రెండు రోజుల జాతీయ సదస్సు పోస్టర్‌ను మంగళవారం అకాడమిలో జూలురు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జూలూరి గౌరి శంకర్ మ్లాడుతూ తెలంగాణలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు చెందిన పలువురు సామాజిక ఉద్యమకారులు కలం యోధులుగా మారి అద్భుతమైన సాహిత్య సృష్టి చేశారన్నారు. భాగ్యరెడ్డి వర్మ, ముగ్ధూం మొహినుద్దీన్, కొండా లక్ష్మణ్ బాపూజీ, సామల సదాశివ, కొత్తపల్లి జయశంకర్, బిరుదరాజు రామరాజు, కాపు రాజయ్య, కపిలవాయి లింగమూర్తి, చందాల కేశవదాస్, చిందు ఎల్లమ్మ వంటి అనే మంది తమ కలాలు, గళాల ద్వారా బహుజన స్ఫూర్తి రగిలించిన యోధులని అభివర్ణించారు. బహుజన గళాలు, కలాలు లేకుండా తెలుగు సాహిత్యమే లేదని జూలూరి గౌరి శంకర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ శ్రీనివాసరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ రమేశ్ బాబు, తెలుగు శాఖ అధ్యక్షులు వెల్దండి శ్రీధర్, ప్రముఖ సాహిత్య విమర్శకులు కేపీ అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# పాక్షిక సూర్య గ్రహణం



(మొదటి పేజి తరువాయి) బ్రహ్మోత్సవం రద్దు చేశారు. బుధవారం నిర్వహించాల్సిన శత ఘటాభిషేకం, సహస్ర నామార్చన, సుదర్శన నరసింహ హోమం రద్దు చేశారు. రేపు ఉదయం 10:30 నుంచి భక్తులకు దర్శనానికి అనుమతించనున్నారు. అలాగే భద్రాద్రి రామాలయాన్ని ఉదయం 10 నుంచి రాత్రి 7 గంటల వరకు మూసివేసారు. -వేములవాడలో రాజన్న ఆలయాన్ని కూడా మూసివేసారు. సుప్రభాత సేవ తర్వాత రాజన్న ఆలయంతో పాటు అనుబంధ ఆలయాలను మూసివేస్తారు. సాయంత్రం 5:35 గంటల తర్వాత సంప్రోక్షణ, పూజాది కార్యక్రమాల అనంతరం భక్తులకు దర్శనం కల్పిస్తారు. జగిత్యాలలో కొండగట్టు ఆంజనేయ స్వామి ఆలయాన్ని మూసివేయనున్నారు. గ్రహణం ముగిసిన తర్వాత ఆలయ సంప్రోక్షణ కార్యక్రమం నిర్వహిస్తారు అనంతరం తిరుమంజనం నిర్వహించి, భక్తులకు సర్వ దర్శనానికి అనుమతిస్తారు. ధర్మపురి ఆలయాన్ని నిత్యారాధన, నివేదన అనంతరం మూసివేయనున్నారు. అలంపూర్ జోగులాంబ ఆలయాన్ని కూడా మూసివేయనున్నారు. ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకు ఆలయాన్ని మూసివేసారు. ఆలయంలో నిర్వహించాల్సిన చండీ హోమాన్ని రద్దు చేశారు.వరంగల్‌లో భద్రకాళి అమ్మవారి, హనుమకొండలో వేయి స్తంభాల గుడిని ఉదయం 9 గంటలకే మూసివేసారు. ఉదయం సంప్రోక్షణ తర్వాత భక్తుల దర్శనాలకు అనుమతిస్తారు. తిరుమలలో ఉదయం 8 నుంచి రాత్రి 7:30 గంటలకు వరకు శ్రీవారి ఆలయ తలుపులు మూసివేసారు. అన్ని ప్రత్యేక దర్శనాలను టీటీడీ రద్దు చేసింది. ఆలయ సంప్రోక్షణ అనంతరం భక్తుల దర్శనానికి అనుమతి ఇవ్వనున్నారు. అలాగే ఉదయం 11 గంటలకు బెజవాడ కనకదుర్గమ్మ ఆలయ తలుపులు మూసివేసారు. ఉదయం 6 గంటలకు దేవతామూర్తులకు స్నపనాభిషేకాలు నిర్వహించి, ఆలయాన్ని తెరవనున్నారు. ఆ తరవాత ఆలయంలో అర్చన, మహానివేదన, హారతి కార్యక్రమాలను నిర్వహించనున్నారు. నేటి మధ్యాహ్నం 12 గంటల నుంచి భక్తుల దర్శనానికి అనుమతి ఇవ్వనున్నారు. విశాఖ సింహాచలం, శ్రీకాకుళం అరసవల్లి ఆలయాలను కూడా మూసివేసారు.

# గౌడ సామాజిక వర్గానికి కెసిఆర్ పెద్దపీట

(మొదటి పేజి తరువాయి) నల్గొండ జిల్లా చండూరులో టీఆర్ఎస్ గౌడ నాయకులు మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో స్వామి గౌడ్ మాట్లాడారు. అన్ని కులాలకు బతకడానికి టీఆర్ఎస్ ప్రభుత్వం అవకాశం కల్పిస్తుందని ఆయన అన్నారు. గీత కార్మికులు చనిపోతే బీమాతో పాటు.. వారు బతికుండగా పని చేసుకునేందుకు ఒక పథకం ప్రవేశపెట్టాలని ప్రభుత్వాన్ని కోరామన్నారు. రోడ్డు ప్రమాదం జరిగితే ఏ విధమైన బీమా కల్పిస్తున్నారో.. గీత కార్మికులకు తాటి చెట్టుపై నుండి పడితే అదే తరహా ప్రయోజనం కల్పించాలని కేటీఆర్ ను కోరామని తెలిపారు.హైదరాబాద్ కు కల్లు సరఫరా చేసుకునేందుకు ప్రభుత్వం అనుమతి కల్పించాలని..వేరే కులస్తులకు ఏ విధంగా వ్యాపార అవకాశాలు కల్పిస్తున్నారో అదే విధంగా గౌడ కులస్థులకూ అవకాశాలు కల్పించాలని కేటీఆర్ ను కోరినట్లు వివరించారు. గౌడలకు వ్యాపార నిమిత్తం వాహనాలు ఇవ్వాలని అడిగామన్నారు. వీటన్నింటికి కేటీఆర్ హామీ ఇవ్వడంతోనే టీఆర్ఎస్ లో చేరానని వివరించారు. కల్లు అమ్ముకునే వద్దనే పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ పెట్టి గౌడలను ఇబ్బంది పెడుతున్న విషయం కూడా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళామని స్వామి గౌడ్ గుర్తు చేశారు. ఏ ఒక్కనాడు ప్రజల కోసం పని చేయని రాజగోపాల్ రెడ్డి ఇవాళ తన స్వార్థం కోసం రాజీనామా చేసి ఎన్నికలకు వచ్చిండని బూడిద భిక్షమయ్య గౌడ్ విమర్శించారు.

# ఇడి కస్టడీకి ఎంబీఎస్ జ్యుయెలర్స్ ఎండీ సుఖేష్ గుప్తా

(మొదటి పేజి తరువాయి) తీసుకున్నారు. చంచల్ గూడ జైలులో ఉన్న ఆయనను అధికారులు ఈడీ ఆఫీసుకు తరలించి ప్రశ్నిస్తున్నారు. కోర్టు ఉత్తర్వుల మేరకు 25వ తేదీ నుంచి నవంబర్ 2వ తేదీ వరకు ఆయన కస్టడీ కొనసాగనుంది. ఎంబీఎస్ జ్యుయెలర్స్ ఎండీ సుఖేష్ గుప్తాను 14 రోజుల కస్టడీకి ఇవ్వాలని ఈ నెల 20న ఈడీ అధికారులు కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ జరిపిన న్యాయస్థానం 9 రోజుల కస్టడీకి అనుమతించింది. విచారణలో భాగంగా ఈడీ అధికారులు ఎంఎంటీసీ నుంచి కొనుగోలు చేసిన బంగారం అమ్మకాల ద్వారా వచ్చిన డబ్బు ఎక్కడికి తరలించారన్న అంశంపై ఆరా తీయనున్నారు. దీంతో పాటు ఇతర బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాల ఎగవేతపైనా సుఖేష్ ను ప్రశ్నించనున్నట్లు తెలుస్తోంది. ఎంఎంటీసీకి రూ.504 కోట్ల రుణం ఎగవేత కేసుకు సంబంధించి ఈడీ సుఖేష్ గుప్తాను ఈ నెల 17న అరెస్ట్ చేసింది. ఈ కేసుకు సంబంధించి సీబీఐ అధికారులు కీలక ఆధారాలు సేకరించగా.. ఈడీ అధికారులు కూడా రంగంలోకి దిగారు. ఈ నెల 16,17 తేదీల్లో తెలుగు రాష్ట్రాల్లోని ఎంబీఎస్ జ్యుయెలర్స్ లో సోదాలు నిర్వహించారు. సోదాల్లో లభించిన కీలక సమాచారం ఆధారంగా సుఖేష్ గుప్తాను అరెస్ట్ చేశారు. ఎంబీఎస్ జుయెలర్స్ నుంచి రూ. 150 కోట్ల విలువైన బంగారం, రూ.1.50 కోట్ల నగదును అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఎంఎంటీసీ సంస్థ నుంచి రూ.504 కోట్ల విలువైన బంగారాన్ని సుఖేష్ గుప్తా క్రెడిట్ రూపంలో తీసుకున్నారు. అయితే ఆ డబ్బు తిరిగి చెల్లించలేకపోవడంతో ఎంఎంటీసీ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా సీబీఐ 2013లో ఎంబీఎస్ జ్యుయెలర్స్ ఎండీ సుఖేష్ గుప్తాపై కేసు నమోదుచేశారు. దీని ఆధారంగా దర్యాప్తు చేపట్టిన ఎన్?ఫోర్స్?మెంట్ డైరెక్టరేట్ అధికారులు దర్యాప్తు చేపట్టారు. చంచల్ గూడా జైల్లో ఉన్న గుప్తాను అధికారులు కస్టడీలోకి తీసుకుని ఈడీ కార్యాలయానికి తరలించారు. తొమ్మిది రోజుల పాటు విచారించనున్నారు.గతంలో రెండు రోజుల పాటు సోదాలు చేసి రూ. 150 కోట్ల బంగారపు ఆభరణాలను రూ. 2 కోట్ల నగదు సీజ్ చేసిన విషయం తెలిసిందే. సుఖేష్ గుప్తా ఎంఎంటీసీకి రూ. 504 కోట్ల మేర భారీ మోసం చేశారు. శ్రేయి ఫైనాన్స్‌లో తీసుకున్న రుణాలతో పాటు ఎంఎంటీసీ సంస్థ నుంచి కొనుగోలు చేసిన బంగారం అమ్మకాలు జరిపిన డబ్బులు ఎక్కడికి తరలించారాని అధికారులు ఆరా తీయనున్నారు. అలాగే ఇతర బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాల ఎగవేతపై కూడా ఆరా తీయనున్నారు. శ్రేయి ఫైనాన్స్‌లో గుప్తా రూ. 110 కోట్ల రుణాలు తీసుకున్నారు. రియల్ ఎస్టేట్ పేరుతో శ్రేయి ఫైనాన్స్‌లో రుణాలు పొందారు. కస్టడీ విచారణలో మరిన్ని విషయాలు వెలుగులోకి వస్తాయని ఈడీ అధికారులు అంటున్నారు.

# మార్కెట్లో అర్థరాత్రి అగ్నిప్రమాదం



**పల్నాడు, అక్టోబర్ 25 (సమ సమాజం):** జిల్లాలోని నరసరావుపేట మార్కెట్ సెంటర్‌లో అర్ధరాత్రి భారీ అగ్నిప్రమాదం సంభవించింది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పలుషాపుల్లో పెద్దఎత్తున మంటలు చెలరేగాయి. ఓ దుకాణంలో చెలరేగిన మంటలు పక్కనే ఉన్న దాదాపు 10 దుకాణాలకు వ్యాపించాయి. సమాచారం అందిన వెంటనే అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకుని మంటలను అదుపు చేశారు. నరసరావుపేట ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అక్కడకు చేరుకుని ప్రమాదస్థలిని పరిశీలించారు.

# రిషి సునాక్‌కు అభినందనలు తెలిపిన ప్రధాని

(మొదటి పేజి తరువాయి) శుభాకాంక్షలు తెలిపారు. గ్లోబల్ సమస్యల పై, 2030 రోడ్ మ్యాప్ పై మీతో కలిసి పనిచేసేందుకు ఎదురుచూస్తున్నట్లు మోడీ తెలిపారు. భారత్, బ్రిటన్ ల మధ్య చారిత్రక సంబంధాలను ఆధునిక బంధాలుగా మారుద్దాం అని మోడీ తన ట్వీట్ లో తెలిపారు. ఈ సందర్భంగా



బ్రిటన్ లోని భారతీయులకు మోడీ దీపావళి శుభాకాంక్షలు తెలియజేశారు. ఇదే సందర్భంగా ప్రదాని మోడీ మాజీ రాష్ట్రతపి రామ్‌నాథ్‌కోవింద్, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, ప్రస్తుత రాష్ట్రపతి ద్రౌపదిముర్ము, ఉపరాష్ట్రపతి జగ్‌దీప్ ధన్‌కడ్‌లను నేరుగా కలిసి దీపావళి శుబాకాంక్షలు తెలిపారు. వారికి ప్రత్యేక అభినందనలు తెలిపారు.

# మునుగోడులో అక్రమాలను నిరోధించండి

(మొదటి పేజి తరువాయి) చేస్తూ బుద్ధ భవన్‌లోని ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయంలో కోదండరాం మౌన ప్రదర్శనకు దిగారు. మునుగోడు ఉప ఎన్నిక సందర్భంగా విచ్చల విడిగా మద్యం, డబ్బు పంపిణీ చేస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల నిబంధనలు పూర్తిగా గాలికొదిలేశారని.. రాజ్యాంగ బద్ధంగా ఎన్నికలు జరుగాలని కోదండరామ్ కోరారు.మునుగోడులో పలు పార్టీల నాయకులు అక్రమాలకు పాల్పడుతూ ఎన్నికల నియమాలను ఉల్లంఘిస్తున్నారని ఈసీకి టీజేఎస్ అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరాం ఫిర్యాదు చేశారు. ఎన్నికల నియమాల ఉల్లంఘనలపై బుద్ధభవన్ ముందు ఆయన మౌన దీక్ష చేశారు. మునుగోడు ఉపఎన్నికలో విచ్చలవిడిగా మద్యం, డబ్బులు పంపిణీ చేస్తున్నారని ఆరోపించారు. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించిన వారిపై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.మునుగోడు ఉపఎన్నిక సమీపిస్తుండడంతో పార్టీలు ప్రచారాన్ని ముమ్మరం చేశాయి. ఈ ఉపఎన్నిక ప్రధాన పార్టీలకు కీలకంగా మారింది. దీంట్లో విజయం సాధిస్తే..రాబోయే ఎన్నికలపై ఆ ప్రభావం తప్పనిసరిగా ఉంటుందని భావిస్తున్నాయి. ఈ క్రమంలో మునుగోడును సీటును గెలుచుకునేందుకు అన్ని పార్టీలు తీవ్రంగా శ్రమిస్తున్నాయి. మునుగోడు ఉప ఎన్నిక బరిలో మొత్తం 47 మంది అభ్యర్థులు ఉన్నారు. నవంబర్ 3వ తేదీన ఉప ఎన్నిక జరగనుండగా, 6వ తేదీన ఫలితాన్ని వెల్లడిస్తారు. టీఆర్ఎస్ పార్టీ నుండి అభ్యర్థిగా కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి, బీజేపీ అభ్యర్థిగా కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నుండి పాల్వాయి స్రవంతి, బీఎస్పీ నుంచి అందోజు శంకరాచారి, టీజేఎస్ నుంచి ప్లలె వినయ్ కుమార్ బరిలో ఉన్నారు.

# డిఎవి స్కూల్ గుర్తింపు రద్దుతో ఆందోళన

(మొదటి పేజి తరువాయి) డీఏవీ స్కూల్ నిర్వహణలో అనేక ఉల్లంఘనలు వెలుగులోకి వస్తున్నాయి. 5వ తరగతి వరకు పర్మిషన్ తీసుకొని ఏడవ తరగతి వరకు నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది. అలాగే సీబీఎస్ఈ సిలబస్ నిర్వహణలోనూ అనుమతుల డొల్ల బయటపడింది. ఈ క్రమంలో బుధవారం హైదరాబాద్ డీఈవో తో స్కూల్ డైరెక్టర్స్ భేటీ కానున్నారు. స్కూల్ గుర్తింపు రద్దను వెనక్కి తీసుకోవాలని కోరిన పేరెంట్స్ వినతి పత్రాలను డీఈవోకు మేనేజ్‌మెంట్ అందజేయనుంది. కాగా... కఠిన చర్యలు తీసుకుంటేనే మిగతా స్కూల్స్ నిబంధనలు సరిగ్గా పటిస్తాయని విద్యాశాఖ భావిస్తోంది. పాఠశాలల్లో భద్రతా ప్రమాణాలపై మంత్రి సబితా ఇంద్రారెడ్డితో కొత్త కమిటీ భేటీ కానుంది. కమిటీ ఏర్పాటుకు ఇప్పటికే మంత్రి ఆదేశాలు ఇచ్చిన విషయం తెలిసిందే. దీంతో విద్యా శాఖ సెక్రటరీ అధ్యక్షతన కమిటీ ఏర్పాటు అయ్యింది. బంజారాహిల్స్ డీఏవీ స్కూల్ వంటి ఘటనలు పునరావృతం కాకుండా ఎలాంటి చర్యలు తీసుకోవాలో కమిటీ నివేదించనుంది.

# నగరంలో వేర్వేరు చోట్ల రెండు ప్రమాదాలే

(మొదటి పేజి తరువాయి)

**హైదరాబాద్,అక్టోబర్ 25 (సమ సమాజం):** హైదరాబాద్ పరిధిలో రెండు వేర్వేరు చోట్ల అగ్ని ప్రమాదాలు జరిగాయి. ఎస్ఆర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కళ్యాణ్ నగర్ లో అగ్ని ప్రమాదం జరిగింది. దీపావళి పండుగ సందర్భంగా కొందరు బాణాసంచా రాకెట్లు పేల్చడంతో..అవి గాల్లోకి ఎగిరి నోబుల్ అపార్ట్ మెంట్ పై ఉన్న సెల్ టవర్ ను నిప్పురవ్వలు తాకాయి. దీంతో వెంటనే షార్ట్ సర్క్యూట్ జరిగి.. అగ్నిప్రమాదం జరిగింది. విషయం తెలియగానే సంఘటనా స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది రెండు ఫైర్ ఇంజన్ల ద్వారా మంటలను ఆర్పివేశారు. ప్రాణనష్టం జరగకపోవడంతో స్థానికులందరూ ఊపిరి పీల్చుకున్నారు. సుమారు రూ.3 లక్షల వరకూ ఆస్తి నష్టం జరిగినట్లు సనత్ నగర్ ÷ర్ ఆఫీసర్ ప్రదీప్ కుమార్ చెప్పారు. ఇటు.. ముషీరాబాద్ లోని ఎస్ ఎంలవుడ్ టింబర్ దుకాణంలో తెల్లవారుజామున అగ్నిప్రమాదం జరిగింది. విషయం తెలిసిన వెంటనే ÷ర్ సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకుని మూడు ఫైర్ ఇంజన్లతో మంటలను ఆర్పివేశారు. ఈ ప్రమాదం ఎలా సంభవించింది అనే దానిపై చిక్కడపల్లి, ముషీరాబాద్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. అగ్నిప్రమాదం బాణాసంచా పేలుళ్ల కారణంగా జరిగిందా..? లేక దుకాణంలో దీపావళి సందర్భంగా వెలిగించిన దీపాల వల్ల జరిగిందా..? అనే కోణాల్లోనూ విచారణ చేస్తున్నారు.

# చేనేతపై జిఎస్టీ రద్దుకు పోస్టుకార్డ్ ఉద్యమం

## మంత్రికెటిఆర్ పిలుపుతో ప్రధానికి పోస్ట్ కార్డు

### మోడీకి ఇ కార్డు రాసిన జడ్పీచైర్మన్ దావ వసంత



**జగిత్యాల,అక్టోబర్ 25 (సమ సమాజం):** మంత్రి కేటీఆర్ పిలుపు మేరకు చేనేత ఉత్పత్తులపై జీఎస్టీని రద్దు చేయాలని జగిత్యాల జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ దావ వసంత సురేశ్ ప్రధానిమోదీకి పోస్ట్ కార్డు రాశారు. ఇప్పటికే ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితతో పాటు పలువురు ప్రధానికి పలువురు లేఖ రాసిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా జడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ జిల్లాలోని చేనేత కార్మికుల పక్షాన చేనేత కార్మికుల సమస్యలను ప్రధాని దృష్టికి తీసుకొచ్చేందుకు పోస్టుకార్డు ఉద్యమంలో తనవంతు బాధ్యతగా కార్డును పంపినట్లు పేర్కొన్నారు.చేనేత వస్త్రాలు, చేనేత ఉత్పత్తులపై ఉన్న ఐదు శాతం జీఎస్టీని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. చేనేత కార్మికులకు సంబంధించిన సంక్షేమ కార్యక్రమాలన్నింటినీ కేంద్ర ప్రభుత్వం రద్దు చేసి, దేశ చరిత్రలో ఎప్పుడూ లేని విధంగా చేనేత ఉత్పత్తులపై పన్ను వేయడం దుర్మార్గమైన చర్య అని అన్నారు. స్వాతంత్ర్య ఉద్యమంలో యావత్ భారత జాతిని ఏకతాటిపై నడిపించిన చేనేత వస్త్రాలపై పన్ను వేసిన తొలి ప్రధాని మోదీనేనని విమర్శించారు. దేశంలో రెండో అతిపెద్ద రంగమైన చేనేతపై పన్నును రద్దు చేయాలని పోస్ట్ కార్డులో పేర్కొన్నారు. చేనేత కార్మికులందరూ కూడా పోస్టుకార్డు ఉద్యమంలో స్వచ్ఛందంగా పాల్గొనాలని పిలుపునిచ్చారు.

# మునుగోడులో జోరుగా నేతల ప్రచారం

కరెంట్ ఇస్తుంటే గుజరాత్‌లో కేవలం 6 గంటల కరెంట్ ఇస్తున్నారని మంత్రి జగదీష్ రెడ్డి విమర్శించారు. రైతుల మోటర్లకి మీటర్ పెడితే తప్పు ఏముందని బీజేపీ అభ్యర్థి రాజగోపాల్ రెడ్డి చెబుతున్నారని..ఒకవేళ రాజగోపాల్ రెడ్డిని గెలిపిస్తే టీఆర్ఎస్ ద్వారా వచ్చే పథకాలన్నీ ఆగిపోతాయని అన్నారు. ఉప ఎన్నిక సందర్భంగా నియోజకవర్గంలో మద్యం ఏరులై పారుతుందని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆరోపించారు. బహుజనులు ఓటు వెయ్యకుంటే బీజేపీ, కాంగ్రెస్, టీఆర్ఎస్ పార్టీలకు డిపాజిట్ కూడా రాదని చెప్పారు. మునుగోడులో జరుగుతున్నది పార్టీల పోరాటం కాదని.. శ్రమజీవులకు, సంపద దోచుకుంటున్న వారి మధ్యనే పోటీ జరుగుతుందన్నారు. ఆ శ్రమజీవులు బీఎస్పీ వైపు ఉన్నారని తెలిపారు. మునుగోడులో మంత్రులు స్వయంగా మద్యం పంపిణీ చేస్తున్నారని అన్నారు. డబ్బులను గూగుల్ పే, ఫోన్ పే ద్వారా ఆన్ లైన్ చెల్లింపులు చేస్తూ ఓటర్లను ప్రలోభాలకు గురి చేస్తున్నా ఎలక్షన్ కమిషన్ పట్టించుకోవడం లేదని ఆరోపించారు. బహుజన రాజ్యం రావాలంటే కష్ట పడాలని.. అందుకోసమే తమ నాయకులు సొంత ఖర్చులతో ప్రచారం చేస్తున్నారని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ చెప్పారు. ఈ నెల 29 న బీఎస్పీ భారీ బహిరంగ సభ ఏర్పాటు చేస్తామని...తెలంగాణలో ఉన్న బహుజనులందరిని భాగస్వామ్యం చేస్తామన్నారు. మునుగోడులో కోటి రూపాయలతో కట్టిన ఎమ్మెల్యే కాంప్ ఆఫీసు.. మందు పార్టీలకు అడ్డాగా మారిందని మండిపడ్డారు. 100 కు 90 మంది బహుజనులు బీఎస్పీ వెంటనే ఉన్నారని.. ఆ 90 మందికి ప్రతినిధిగా తమ అభ్యర్థి ఆందోజు శంకరాచారి ఉన్నారని చెప్పారు. వారందరి గొంతుకై ఇక్కడి సమస్యలపై కొట్లాడుతాడరని చెప్పారు. సూర్యగ్రహణం రోజు కూడా కాంగ్రెస్ అభ్యర్థి పాల్వాయి స్రవంతి చండూర్ మున్సిపాలిటీ అంగడిపేటలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్నారు. గడప గడపకు తిరుగుతూ కాంగ్రెస్ కు ఓటు వేసి తనను గెలిపించాలని ఓటర్లను వేడుకుంటున్నారు. కాంగ్రెష్ హయాంలో ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి పాల్వాయి స్రవంతి ప్రజలకు వివరిస్తు?న్నారు. ఆడబిడ్డను గెలిపించి మహిళల ఆత్మగౌరవాన్ని కాపాడాలని ఓటర్లను అభ్యర్థిస్తున్నారు.

# వెంకట్‌రెడ్డిని కాంగ్రెస్ పక్కన పెట్టాలి

(మొదటి పేజి తరువాయి) బీజేపీ అభ్యర్థి కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిని గెలిపించాలని ప్రచారం చేయడం ఎంత వరకు సరైనది అని ప్రశ్నించారు. కోమటిరెడ్డి కోవర్ట్ ఆపరేషన్ పనికిమాలిన చర్య అని అన్నారు. కాంగ్రెస్ అధిష్టానం ఇచ్చిన షోకాజ్ నోటీసులకు కోమటిరెడ్డి జవాబు చెప్పాల్సిందేనని సీతక్క డిమాండ్ చేశారు. బంధాలకతీతమే రాజకీయాలు.. నిబద్ధత గల రాజకీయాలు చేయాలనుకుంటే.. పార్టీ నిబంధనలు, సిద్ధాంతాలకు కట్టుబడి పని చేయాలని సూచించారు. తమ్ముడి గెలుపే ముఖ్యమైతే.. కాంగ్రెస్ కండువాను తీసి పక్కనపెట్టి, బీజేపీ కండువా కప్పుకొని ప్రచారం చేయాలని ధ్వజమెత్తారు. ఆపదలో అండగా ఉండాల్సింది పోయి ఆస్ట్రేలియాకు పోవడం ఏంటని సీతక్క నిలదీశారు. మునుగోడు ఉపఎన్నికలో బీజేపీ, టీఆర్ఎస్ పార్టీలను ఓడించి గుణపాఠం చెప్పాలని సీతక్క అన్నారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పాల్వాయి స్రవంతిరెడ్డిని గెలిపించాలని ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అహంకారానికి, నీతి, నిజాయితీకి మధ్య ఉపఎన్నిక జరుగుతోందన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రజల గుండెల్లో ఉందని, చెయ్యి గుర్తుపై గెలిచిన అభ్యర్థులు, పార్టీ మారిన కార్యకర్తలు ఎప్పుడూ కాంగ్రెస్ వెంటే ఉన్నారని అన్నారు. సీఎం కేసీఆర్ డిండి ప్రాజెక్టును పూర్తి చేయలేదని ఎద్దేవా చేశారు. మునుగోడు నియోజకవర్గం కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే అభివృద్ధి చెందిందన్నారు. పాల్వాయి గోవర్ధన్‌రెడ్డి మంత్రిగా మునుగోడు అభివృద్ధికి ఎంతో కృషి చేశారని గుర్తు చేశారు. ఆయన వారసురాలు పాల్వాయి స్రవంతిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

# వాట్సాప్‌కు గ్రహణ...వీడింది !

(మొదటి పేజి తరువాయి) జరుగుతుందో తెలియక యూజర్లు ఆయోమయానికి గురవుతున్నారు.వాట్సప్ యూజర్లు తొలుత ఇంటర్నెట్ ప్రా÷-లబెం కారణంగా మెసేజ్ పంపలేకపోతున్నామని భావించారు. కానీ అరగంట గడిచినా ప్రా÷-లబెం కంటిన్యూ కావడంతో విషయం అర్థమైంది. భారత్?తో పాటు ఇటలీ, టర్కీలోనూ వాట్సప్ సేవలు నిలిచిపోయినట్లు తెలుస్తోంది. వాట్సప్ అంతరాయానికి సంబంధించి కంపెనీ ఇప్పటి వరకు స్పందించలేదు. వాట్సప్ సేవలు నిలిచిపోవడంతో సోషల్ మీడియాలో మీమ్స్ వెల్లువెత్తాయి. అయితే దాదాపు రెండు గంటల అనంతరం వాట్సప్ పనిచేస్తోంది. ఇవాళ మధ్యాహ్నం 12. 30 గంటల నుంచి నిలిచిపోయిన వాట్సప్ సేవలు.. తిరిగి 2.15 గంటల నుంచి పునరుద్ధరించబడ్డాయి. అందరికి మెసేజ్ లు వెళుతున్నట్లు యూజర్లు సోషల్ మీడియాలో కామెంట్లు చేస్తున్నారు. యూజర్లు మెసేజ్ లు పంపలేకపోతున్నట్లు తమ దృష్టికి రావడంతో సమస్యను పరిష్కరించినట్లు మెటా కంపెనీ ప్రతినిధి చెప్పారు.సర్వర్ డౌన్ అవడమే కారణమని... టెక్నికల్ ఎక్స్ పర్ట్స్ వాట్సప్ ను త్వరగా రీస్టోర్ చేశారని వెల్లడించారు. దేశ వ్యాప్తంగా 50 కోట్ల డౌన్ లోడ్స్ జరిగాయి. ప్రపంచ వ్యాప్తంగా 500 కోట్లకు పైగా వాట్సప్ డౌన్ లోడ్స్ జరిగాయి. వాట్సప్ లో రోజుకు 10వేల కోట్ల మెసేజ్ లు సెండ్ అవుతున్నాయి. 80 దేశాల్లో వాట్సప్ కు యూజర్లు ఉన్నారు. వాట్సప్ ద్వారా నిమిషానికి 2 కోట్ల 9 లక్షల మెసేజ్ లు సెండ్ అవుతున్నాయి. వాట్సప్ లో ప్రతి రోజూ 5 కోట్ల 5 లక్షలకు పైగా వీడియో కాల్స్ జరుగుతున్నాయి. యూజర్లు ప్రతి రోజూ సగటున 23 సార్లు వాట్సప్ ఓపెన్ చేస్తున్నారు . అలాగే ప్రతి రోజూ వాట్సప్ కు సగటున 10 లక్షలకు పైగా కొత్త యూజర్లు వస్తున్నారు.

# రిషి సునాక్ బ్రిటన్‌ను చక్కబెడతారు

(మొదటి పేజి తరువాయి)

**బెంగళూరు,అక్టోబర్ 25 (సమ సమాజం):** రిషి సునాక్ బ్రిటన్ ప్రధాని కాబోతున్న వేళ ఇన్ఫోసిస్ ఫౌండర్, రిషి సునాక్ మామ నారాయణ మూర్తి స్పందించారు. తమ అల్లుడు రిషి సునాక్ బ్రిటన్ కు ప్రధానిగా ఎన్నిక కావడం చాలా ఆనందంగా ఉందన్నారు. రిషి ఎన్నిక తమ కుటుంబానికే కాక యావత్తు భారత్ కు చాలా గర్వకారణమని తెలిపారు. ప్రధానిగా రిషి బ్రిటన్ ప్రజలకు అత్యున్నత సేవలు అందిస్తారనే నమ్మకం ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు. 2009లో ఇన్ఫోసిస్ నారాయణ మూర్తి కూతురు అక్షతామూర్తితో రిషి సునాక్ కు బెంగళూరులో వివాహమైంది. రిషి, అక్షతామూర్తి దంపతులకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. బ్రిటన్ ప్రధాన మంత్రిగా భారత సంతతికి చెందిన రిషి సునాక్ ఎన్నికై చరిత్ర సృష్టించారు. అతి చిన్న వయసులోనే ఆయన ప్రధాని కావడంపై ప్రపంచ వ్యాప్తంగా అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. ఈ క్రమంలో తన అల్లుడి విజయంపై ప్రముఖ వ్యాపారవేత్త, ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకులు నారాయణ మూర్తి స్పందించారు. సునక్ ప్రధాని కావడంపై తాము ఎంతో గర్వపడుతున్నామని అన్నారు. యునైటెడ్ కింగ్‌డమ్ ప్రజల కోసం తన వంతు కృషి చేస్తాడని తాము విశ్వసిస్తున్నామని పేర్కొన్నారు. రిషి సునక్ ఔన్నత్యంపై ముఖ్యమంత్రి బసవరాజ్ బొమ్మై సంతోషం వ్యక్తం చేశారు. బ్రిటీషర్లు భారతదేశాన్ని 200 ఏళ్లకు పైగా పాలించారని.. ఇంత పెద్ద అభివృద్ధిని తాము ఊహించలేదని అన్నారు. రిషికి అభినందనలు. మేం అతనిని చూసి గర్విస్తున్నాం.. అతని విజయాన్ని కోరుకుంటున్నాం అంటూ ఆయన ట్వీట్ చేశారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని కోరుకుంటున్నాను. తొలి భారత సంతతి చెందిన నేత రిష్ సునాక్ కావడంపై సర్వత్రా హర్షం వ్యక్తం అవుతోంది.

# మునుగోడులో వంద చెక్ పోస్టుల ఏర్పాటు

(మొదటి పేజి తరువాయి) వద్ద ఇద్దరు ఎస్ఐలు విధులు నిర్వహిస్తున్నారు. ఇప్పటి వరకు రూ. 2 కోట్ల 65 లక్షల నగదు, 1480 లీటర్ల మద్యం పట్టుబడింది. మునుగోడు ఉప ఎన్నికను పకడ్బందిగా నిర్వహించేందుకు ఎన్నికల కమిషన్ అన్ని ఏర్పాట్లు చేస్తోంది.

# నార్సింగ్ సదర్ ఉత్సవాల్లో ఘర్షణ

(మొదటి పేజి తరువాయి) అనుచరులు రాళ్లతో దాడి చేశారు. ఈ దాడిలో అశోక్ యాదవ్ సహా పలువురికి గాయాలైనట్లు తెలుస్తోంది. మొత్తం 13 మందికి గాయాలవ్వగా.. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. అంతకుముందు నార్సింగి సదర్ ఉత్సవాల్లో ఆల్ ఇండియా ఛాంపియన్ షిప్ అందుకున్న దున్నపోతు చాంద్ వీర్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ తీన్మార్ స్టెప్పులేసి అందరిలో జోష్ నింపారు. సినీ నటుడు, మిమిక్రీ కళాకారుడు శివారెడ్డి సైతం ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. సదర్ ఉత్సవాలను తిలకించేందుకు వందల మంది నార్సింగికి తరలి వచ్చారు.




# చలన చిత్రం

# హరిహరవీరమల్లులో రాబిన్‌హుడ్ తరహా పాత్రలో పవన్ కళ్యాణ్



పవర్ స్టార్ పవన్ కల్యాణ్ కెరీర్ లో తొలి సారి చేస్తున్న పీరియాడిక్ ఫిక్షన్ మూవీ 'హరి హర వీరమల్లు'. క్రిష్ జాగర్ల మూడీ ఈ మూవీని తెరకెక్కిస్తున్నారు. మెగా సూర్య ప్రొడక్షన్స్ బ్యానర్ పై స్టార్ ప్రొడ్యూసర్ ఏ.ఎం.రత్నం సమర్పణలో ఏ. దయాకర్ రావు ఈ మూవీని నిర్మిస్తున్నారు. నిధి అగర్వాల్ హీరోగా నటిస్తున్నఈ మూవీలో బాలీవుడ్ బ్యూటీ జాక్వెలిన్ ఫెర్నాండెజ్ నటిస్తోంది. ఇక కీలక విలన్ పాత్రలో అర్జున్ రాంపాల్ కనిపించనున్న విషయం తెలిసిందే. 17 శతాబ్దంలోని మోఘల్ సామ్రాజ్య కాలం నాటి కథతో ఓ ఫిక్షనల్ మూవీగా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఇప్పటి వరకు యాభై శాతం చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ మూవీ తదుపరి షెడ్యూల్ ప్రారంభం కావాల్సి వుంది. అయితే గత కొన్ని నెలలుగా పవన్ కల్యాణ్ జనసేన పార్టీ కార్యకలాపాల్లో బిజీగా వుండటం వల్ల ఈ మూవీ షూటింగ్ తదుపరి షెడ్యూల్ నిరవధికంగా వాయిదా పడుతూ వస్తోంది. ఇటీవలే తదుపరి షెడ్యూల్ కోసం ప్రత్యేకంగా వర్క్ షాప్ లో టీమ్ తో కలిసి పవన్ కల్యాణ్ పాల్గొన్న విషయం తెలిసిందే. ఇదిలా వుంటే ఇటీవలే పార్టీ కార్యక్రమాల కోసం వైజాగ్ వెళ్లిన పవన్ కల్యాణ్ తనదైన వ్యాఖ్యలతో సంచలనం సృష్టించారు. దీంతో అక్కడ రాజకీయ వేడి రాజుకుంది. తాజా పరిణామాల నేపథ్యంలో పవన్ 'హరి హర వీరమల్లు' తాజా షెడ్యూల్ ని ప్రారంభించడానికి మరి కాస్త టైమ్ తీసుకునే అవకాశం వుందని ఇండస్ట్రీ వర్గాల్లో వినిపిస్తోంది. ఈ నేపథ్యంలో ఈ మూవీకి సంబంధించిన ఓ ఆసక్తికరమైన అంశం తాజాగా బయటికొచ్చి ఫ్యాన్స్ కి ఆనందాన్ని కలిగిస్తోంది. ఈ మూవీలో పవన్ కల్యాణ్ రాబిన్ హుడ్ తరహాలో సాగే బందిపోటు దొంగగా కనిపించనున్న విషయం తెలిసిందే. మొఘల్ సామ్రాజ్యంలో వున్న కోహినూర్ వజ్రం చుట్టూ ఈ మూవీ కథ సాగుతుందని తెలుస్తోంది. అయితే ఈ మూవీకి సంబంధించిన ఇంట్రెస్టింగ్ ట్విస్ట్ క్లైమాక్స్ లో రివీల్ కానుందని అది పవ్ కల్యాణ్ మనస్తత్వానికి చాలా దగ్గరగా వుంటుందని చెబుతున్నారు. అదే సినిమాకు ప్రధాన హైలైట్ గా నిలుస్తుందని ఇది ఫ్యాన్స్ ని మరింత ఆనందాన్ని కలిగించి సర్ ప్రైజ్ చేస్తుందని ఇన్ సైడ్ టాక్. ఇదిలా వుంటే ఈ మూవీతో పాటు పవన్ కల్యాణ్ మరో రెండు రీమేక్ సినిమాలని లైన్ లో పెట్టిన విషయం తెలిసిందే. విజయ్ హీరోగా నటించిన 'తేరీ' మూవీతో పాటు సముద్రఖని నటించి తెరకెక్కించిన 'వినోదాయ సితం' రీమేక్ లోనూ నటించబోతున్నారు. 'తేరీ' రీమేక్ ని డీవీవీ దానయ్య నిర్మించనుండగా సుజీత్ డైరెక్ట్ చేయబోతున్నాడు. ఇక సముద్రఖని నటించి తెరకెక్కించిన 'వినోదాయ సితం'ని పీపుల్ మీడియా ఫ్యాక్టరీ వారు నిర్మించనున్నారు. దీనికి సముద్రఖని దర్శకత్వం వహించబోతున్నారు.



# కాంతారాకు ఫిదా అయిన పూజాహెగ్డే

అక్టోబర్25(ఆర్ఎన్ఎ):కేజీఎఫ్ తర్వాత కన్నడ ఇండస్ట్రీ నుంచి విడుదలై టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగా నిలుస్తున్న చిత్రం కాంతారా. యాక్షన్ మిస్టరీ థ్రిల్లర్ నేపథ్యంలో కేజీఎఫ్ ఫేం హోంబలే ఫిలింస్ బ్యానర్‌లో విజయ్ శిరగందూర్ తెరకెక్కించారు. రిషబ్ శెట్టి స్వీయ దర్శకత్వంలో లీడ్ రోల్ పోషించిన ఈ మూవీ సెప్టెంబర్ 30న మాతృక భాష కన్నడలో విడుదలై భారీ రికార్డులు సృష్టిస్తోంది. ఈ చిత్రం తెలుగు వెర్షన్‌ను గీతా ఆర్ట్స్ బ్యానర్ విడుదల చేసిన విషయం తెలిసిందే. తెలుగులో కూడా మంచి టాక్‌తో కలెక్షన్లు వసూళ్లు చేస్తోంది. ఈ సినిమాపై పలువురు సామాన్య ప్రజలే కాకుండా సెలబ్రిటీలు సైతం ప్రశంసలు కురిపిస్తున్నారు. తాజాగా నటి పూజా హెగ్డే ఈ చిత్రంపై ప్రశంసలు కురిపించారు. మీకు ఏం తెలుసో దాన్నే రాయండి. మీ హృదయానికి చేరువైన, మనసులో నుంచి వచ్చిన కథలనే చెప్పండి. సినిమాలోని ఆఖరి 20 నిమిషాలు స్టన్ యిపోయాను. పూర్తిగా నన్ను నేను మైమరిచిపోయాను. రిషబ్ శెట్టి.. 'కాంతార' విశేషమైన ఆదరణ ÷రిందుతున్నందుకు గర్వంగా ఉంది. నా చిన్నతనంలో చూసిన కోలాలు, భూతాలు, దైవాలను వెండితెర మీద గౌరవప్రదంగా, అందంగా ఆవిష్కరించారు. మీరు మరిన్ని మంచి సినిమాలు తీయాలి. మరింత ఎత్తుకు ఎదగాలని అంటూ తన అభిప్రాయాన్ని ఇన్‌స్టాగ్రామ్ స్టోరీస్‌లో పంచుకున్నారు.



# బాలయ్యతో వెంకీ కుడుముల ఫ్యామిలీ డ్రామా

నాగశౌర్య హీరోగా నటించిన 'ఛలో' మూవీతో దర్శకుడిగా పరిచయమై తొలి చిత్రంతో మంచి గుర్తింపుని సొంతం చేసుకున్న దర్శకుడు వెంకీ కుడుముల. ఈ మూవీ తరువాత నితిన్ తో 'భీష్మ' అంటూ సేంద్రియ సేద్యం గురించి వివరించి ఓ రొమాంటిక్ లవ్ స్టోరీని తెరకెక్కించిన మంచి విజయాన్ని సొంతం చేసుకున్న వెంకీ కుడుముల గత కొన్ని నెలలుగా మెగాస్టార్ చిరంజీవితో కలిసి ఓ భారీ మూవీ చేయాలని ప్లాన్ చేసుకుంటున్నాడు. డీవీవీ దానయ్య డీవీవీ ఎంటర్ టైన్ మెంట్స్ బ్యానర్ పై నిర్మించాలనుకున్నారు. ఆ మధ్య అధికారికంగా ఈ ప్రాజెక్ట్ కు సంబంధించిన ప్రకటనని కూడా విడుదల చేశారు. కానీ ఏం జరిగిందో ఏమో తెలియదు కానీ ఆ ప్రాజెక్ట్ ఇంత వరకు పట్టాలెక్కలేదు. అంతే కాకుండా మెగాస్టార్ వరుసగా ప్రాజెక్ట్ లు చేస్తుండటంతో ఈ ప్రాజెక్ట్ పట్టాలెక్కడం కష్టమనే వార్తలు చక్కర్లు కొట్టడం మొదలైంది. ఫ్యాన్స్ కూడా చిరుతో వెంకీ కుడుముల ప్రాజెక్ట్ కష్టమని ఓ నిర్ణయానికి వచ్చేశారు. దర్శకుడు వెంకీ కుడుముల కూడా ఇదే ఫీలై మరో హీరోని వెతుక్కుంటున్నాడనే వార్తలు మొదలయ్యాయి. ఇదిలా వుంటే చిరుతో ప్రాజెక్ట్ చేయాలనుకున్న వెంకీ కుడుముల తాజాగా మరో సీనియర్ హీరో నందమూరి బాలకృష్ణతో ఫ్యామిలీ ఎంటర్ టైనర్ కు ప్లాన్ చేసుకుంటున్నాడని తెలుస్తోంది. ఈ మధ్య కాలంలో సాఫ్ట్ గా సాగే ఫ్యామిలీ ఎంటర్ టైనర్ లని బాలయ్య చేయలేదు. ఈ నేపథ్యంలోనే వెంకీ కుడుముల చేసిన సినిమాలు తనకు బాగా నచ్చాయట. ఎంటర్ టైన్ మెంట్ తో పాటు ఫ్యామిలీ ఆడియన్స్ ని మెప్పించే సినిమాలు కావడంతో వెంకీ కుడుములతో కలిసి అలాంటి సినిమా చేయాలనే ఆలోచనలో బాలయ్య వున్నారట. ఇప్పటికే తనకు ఈ విషయం చెప్పారని వెంకీ కుడుముల కూడా బాలయ్యకు ఓ ఫ్యామిలీ ఎంటర్ టైనర్ స్టోరీని నరేట్ చేశారని వార్తలు వినిపిస్తున్నాయి. ఇదిలా వుంటే నందమూరి బాలకృష్ణ ప్రస్తుతం గోపీచంద్ మలినేని డైరెక్షన్ లో 'వీరసింహారెడ్డి' మూవీలో నటిస్తున్నారు. ఈ మూవీ వచ్చే ఏడాది సంక్రాంతికి థియేటర్లలోకి రానుంది. ఇక దీని తరువాత అనిల్ రావిపూడి డైరెక్షన్ లో బాలయ్య మరో సినిమాని వచ్చే నెలలో మొదలు పెట్టబోతున్నారు. ఈ మూవీ తరువాతే వెంకీ కుడుముల ప్రాజెక్ట్ పట్టాలెక్కే అవకాశం వుందని తెలుస్తోంది.

# తెలుగులో పునీత్ చక్రవ్యూహ విడుదలకు సన్నాహాలు




కన్నడ సూపర్ స్టార్ పునీత్ రాజ్ కుమార్ హీరోగా నటించిన సూపర్ హిట్ మూవీ 'చక్రవ్యూహ' తెలుగులో 'సివిల్ ఇంజినీర్' పేరుతో విడుదల కానుంది. నవంబర్ లో ఈ చిత్రాన్ని రిలీజ్ చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. దీపావళి పండుగ సందర్భంగా మూవీ మేకర్స్ ట్రైలర్ రిలీజ్ చేశారు. దివంగత పునీత్ రాజ్ కుమార్ నటించిన చక్రవ్యూహ సినిమా కన్నడంలో 2016లో విడుదలై సూపర్ డూపర్ హిట్ గా నిలిచించి. బాక్సాఫీసు కలెక్షన్లు కొల్లగొట్టింది. ఎం.శరవణన్ దర్శకత్వంలో రూపుదిద్దుకున్న ఈ సినిమాలో పునీత్ రాజ్ కుమార్ సరసన రుచితా రామ్ హీరోయిన్ గా నటించింది. థమన్ సంగీత స్వరాలు అందించిన ఈ సినిమాలో హీరో పునీత్ లోహిత్ పాత్రలో అలరించాడు. అరుణ్ విజయ్, అభిమన్యు సింగ్, భవ్య తదితరులు ముఖ్య పాత్రలు పోషించారు.

# హోటల్ బిజినెస్‌లోకి మహేశ్ బాబు

సూపర్‌స్టార్ మహేశ్‌బాబు గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఓ వైపు సినిమాల్లో నటిస్తూనే మరో వైపు వ్యాపార రంగంలో రాణిస్తున్నారు. నటుడిగా, నిర్మాతగా, వ్యాపార వేత్తగా రెండు చేతులా సంపాదిస్తున్నారు. ఇప్పటికే మహేశ్ మల్టీప్లెక్స్ బిజినెస్‌లోకి అడుగుపెట్టిన విషయం తెలిసిందే. ఆయన పేరుమీదున్న ఏఎంబీ సినిమాస్ ఇండియాలోనే బిగ్గెస్ట్ మల్టీప్లెక్స్‌లలో ఒకటి. ఇక మహేశ్ కేవలం థియేటర్ బిజినెస్ మాత్రమే కాకుండా టెక్స్‌టైల్స్ బిజినెస్‌లోనూ అడుగుపెట్టారు. మహేశ్‌కు సంబంధించిన అన్ని వ్యాపారాలను ఆయన సతీమణి నమ్రత శిరోద్కర్ చూసుకుంటుంటారు. తాజా సమాచారం ప్రకారం.. మహేశ్‌బాబు హోటల్ బిజినెస్‌లోకి అడుగుపెడుతున్నట్లు తెలుస్తోంది. తన భార్య నమ్రత పేరుతో ఈ హోటల్‌ను ప్రారంభించబోతున్నట్లు సమాచారం. మినర్వ గ్రూప్‌తో కలిసి మినర్వా -ఏఎన్ (ఏఎన్-ఏషియన్ నమ్రతా) పేరుతో బంజారాహిల్స్‌లో రెస్టారెంట్ ఏర్పాటు చేయబోతున్నట్లు టాలీవుడ్‌లో టాక్ వినిపిస్తోంది. ఇందుకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు ఇప్పటికే పూర్‌ఖ్తైనట్లు సమాచారం. త్వరలోనే ఈ బిజినెస్‌పై అధికారిక ప్రకటన చేయనున్నట్లు తెలుస్తోంది. మరి ఇది ఎంత వరకు నిజమన్నది తెలియాల్సి ఉంది.ప్రస్తుతం మహేశ్ బాబు.. మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ డైరెక్షన్‌లో సినిమా చేస్తున్నాడు. మహేశ్ 28వ సినిమాగా రూపుదిద్దుకుంటోన్న ఈ చిత్ర షూటింగ్ తొలి షెడ్యూల్ ఇప్పటికే పూర్‌ఖ్తైంది. ఇటీవల తన తల్లి ఇందిరాదేవి మరణంతో మహేశ్ రెండో షెడ్యూల్‌కు కాస్త విరామం తీసుకున్నారు. ఈ సినిమాలో మహేశ్ సరసన పూజా హెగ్డే నటిస్తున్నారు. హారిక హాసిని క్రియేషన్స్ బ్యానర్ మీద చినబాబు, నాగ వంశీ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.




Edited, Printed, Published & owned by **GOSUKONDA PRUDHVIRAJU**, Published From, H.No. 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, TELANGANA,
Printed at **Panidhar PUBLICATIONS**. H.NO: 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, Editor: **GOSUKONDA PRUDHVIRAJU**,
RNI.TELTEL/2016/ 73311, Cell:8897334003 Email: samasamajamdaily@gmail.com, Website: www.samasamajam.in